

# బ్రతుకు తెరువు

కొండముది రుక్మిణీదేవి

"పాపిష్టిదానా! ఎన్నాళ్ళ నుంచో కాపాడుకుంటూ వస్తున్న వస్తువును 'నీ మొహాన పెట్టుకున్నావు గదే!'' పొయిలో పుల్లలు ఎగసనదోస్తూ వందోసారి అన్నది ఆదిలక్ష్మి

"నీ తెలివితక్కువ తనానికి దాన్ని అంటావు దేనికి? అభం, శుభం తెలీని పిల్ల దాన్నేమీ అనకు'' అంటూ భార్యమీద విరుచుకుపడ్డాడు శంకరం.

"నిజమేలెండి నా తెలివితక్కువ తనమే! లేకపోతే అందరిలాగా అమ్మి వేయించుకునే దాన్నే...'' భార్య ఇహ అలా మాట్లాడుతూనే వుంటుందని, పని లేకపోయినా చెప్పు లేసుకుని బయటకు నడిచాడు శంకరం. అతనలా వెళ్ళగానే ఆదిలక్ష్మి దొడ్లో వున్న తులసి చెట్టుకు నీళ్ళు పోసి, పొయికింద పుల్లలు ఆర్పి, వరండాలోకి వచ్చి కూర్చున్నది. నాలుగేళ్ళ నర్మద మంచం దిగి, "అమ్మా'' అంటూ తల్లి దగ్గరకు వచ్చింది అమాయకంగా. ఆ పిల్లను చూడగానే ప్రాణం తరుక్కుపోయినట్టనిపించి, చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకుని, ముద్దుల వర్షం కురిపిస్తూ "పాపిష్టిదాన్ని, నిన్ని దెబ్బలు కొట్టాను'' అనుకున్నది స్వగతంగా. కూతురంటే అంతులేని ప్రేమ ఆదిలక్ష్మికి అవునుమరి తను కాపరానికి వచ్చిన ఇన్నాళ్ళకు పుట్టింది తనుకాపరానికి వచ్చి మూడు పదులు దాటినా పిల్లలు పుట్టకపోయేసరికి, తమకు ఇహ ఆ యోగం లేదేమో అనుకుంటున్న తరుణంలో నర్మద పుట్టింది అలాంటప్పుడు ఆ పిల్లమీద పంచప్రాణాలూ పెట్టుకొనటం వింతేమీ కాదు. కానయితే ఆ గారాల బిడ్డకు పొద్దున్నే వెండి గిన్నెలో పాలుపోసి ఇచ్చింది. ప్రతిరోజూ అలాగే ఇస్తుంది ఈ రోజు తను పరాకుగా వున్నది. నర్మద గిన్నె తీసుకుని, వీధిలోకి వెళ్ళింది. మరుక్షణంలోనే "అమ్మా! గిన్నె అబ్బాయి...'' అంటూ, వచ్చీరాని మాటలతో చెప్పింది. వెంటనే తను బయటకు వెళ్ళి చూసుకోకుండా ఎదురుగా వున్న పిల్లను చావబాది, ఆవేశం తగ్గాక బయటకు వెళ్ళి చూస్తే అక్కడ ఎవరూ లేరు తన నిస్సహాయతను, తెలివి తక్కువ తనాన్ని మరొకసారి ఆ పసిదానిమీద ప్రదర్శించి. చెయిచేసుకున్నది. తల్లిప్రేమను తప్ప ఆగ్రహాన్ని రుచిచూసి ఎరుగని నర్మద శారీరకంగా, మానసికంగా ఆ బాధ భరించలేక సొమ్మసిల్లి అలాగే పడుకుని నిద్దర పోయింది కూతురు ముఖంలోకి చూసిన ఆదిలక్ష్మికి కళ్ళవెంబడి నీళ్ళు వచ్చాయి. ఆ కన్నీటి పొరల మధ్య నుంచి, మాయమైన వెండిగిన్నె లీలగా కనిపిస్తున్నది ఆ వెండి గిన్నె ఈనాటిది కాదు అమ్మమ్మ అమ్మకు ఇచ్చింది. అమ్మ తనకి ఇచ్చింది కాపరానికి వచ్చేటప్పుడు అమ్మ ఇచ్చిందన్న అభిమానమే కాదు ఎన్నోసార్లు జీవితావసరాలకి ఆదుకున్నది ఆ వెండి గిన్నె కొత్తగా కాపరం పెట్టిన రెండు నెల్లకే అత్తగారికి సుస్తీగా వుందని పల్లెటూరు వస్తే, వెళ్ళటానికి చేతిలో డబ్బు లేదు అప్పుడు ఆ గిన్నె ఆదుకున్నది ఆ బిడ్డకు పెళ్ళి చూపులప్పుడూ, మరిది కాలేజి ఫీజు కట్టినరోజూ, శంకరం యూనియన్ మీటింగుకు వెళ్ళినప్పుడు కూడా ఆ గిన్నెమీదనే డబ్బు తీసుకువచ్చారు అయితే తీసుక వచ్చిన ప్రతిసారి ఆ పని సానుకూలపడుతూనే వున్నది.

అంతెందుకు ఆదిలక్ష్మి పసవించే రోజున చేతిలో వున్న వంద రూపాయలు మందులకు చాలకపోతే ఆ వెండి గిన్నెని నే

## బ్రతుకు తెరువు

మరొక వంద తీసుకువచ్చాడు శంకరం. ఆ తరువాత అర్నెల్లకుగాని, దాన్ని విడిపించుకోలేక పోయారు. అదీ నర్మద అన్నప్రాశనరోజు పట్టుపెట్టి ఆ గిన్నె తెప్పించింది తాను. ఒకరకంగా ఆ ఇంటికిస్థిరాస్తి ఆ వెండి గిన్నె! అలాంటి వెండిగిన్నె క్షణంలో మాయమైతే ఎవరికి మాత్రం బాధగా వుండదు.

"లేచి అన్నం పెడతావా ?" అన్న భర్త మాటతో ఈ లోకంలోకి వచ్చిన ఆదిలక్ష్మి, "రా ! అమ్మలూ" అంటూ కూతురి చెయ్యి పట్టుకుని తీసుకువచ్చి పీటమీద కూర్చోపెట్టింది.

"లక్ష్మీ! దాన్ని ఎలా కొట్టగలిగావు?! ఆ పసిదాని బుగ్గలెలా కంది పోయాయో చూడు" కూతురి వంక ప్రేమగా చూస్తూ అన్నాడు శంకరం.

అంతే ఆదిలక్ష్మి ఛర్రునలేచింది. "మీకే దానిమీద మహా ప్రేమవున్నట్లు, అయినా ఆ వెండి గిన్నెను అప్పుడే విట్నా మర్చి పోయారండీ ?! విన్నిసార్లు మీ అవసరాల్ని, బరువుని కాపాడింది. మూడు తరాల్నించి చేతులు మారిన గిన్నె, ఈనాటితో రుణం తీరిపోయింది. ఆ వెండి గిన్నెవుండి నన్నేదో వుద్ధరిస్తుందని కాదు. అందులో తినందే, తాగందే, నాకు అరక్కపోదు. ముందు ముందు మరెన్ని అవసరాలు వస్తాయ్యో..?"

"నిజమే అనుకో! పోయిన దాన్నిగురించి బాధపడి ప్రయోజనం ఏం వున్నది. మరొకటి కొనటానికి ప్రయత్నం చెయ్యాలిగాని." అనునయంగా అన్నాడు శంకరం.

ఆ మాట ఆదిలక్ష్మిని మరీ రెచ్చగొట్టింది.

"ఆ ! ఆ ! చాలా చేయించాములేండి. అన్ని చేయించుకోగా లేంది, ఈ ఒక్క గిన్నె పోతేమాత్రమేం ! అప్పుచేసి, పెళ్ళిచేసి అత్తవారింటికి పంపిస్తే అన్నగారు చీరైనా పెట్టలేరని చెల్లెలు తిరిగి చూడలేదు. తమ్ముడికి వారాలు కుదుర్చి, వెండిగిన్నె, నీళ్ళబిందె తాకట్టుపెట్టి జీతం కట్టి చదివిస్తే, ఆఫీసరైన తరువాత, నువ్వు చేసిందెంతలే .. అన్నట్లు మాట్లాడి వెళ్ళాడు. యూనియన్ మీటింగులకు వేళ్ళి చమురు వదుల్చుకుని, రాత్రనక, పగలనక తిరిగితే అవకాశం చూసుకుని, అందరూ పదవుల్లోకి వెళ్ళి మిమ్మల్ని అణగదొక్కారు. ఈ అనుభవాలే మనకు వంకీలు, వడ్డాణాలూ, ఇంకా వెండిగిన్నెలు కూడా ఏక్కడ చేయిస్తాం!" నిష్ఠూరంగా అన్నది.

ఆదిలక్ష్మి అన్నదాంట్లో ఏ ఒక్కటీ అబద్ధం కాదు. అన్నీ నిప్పులాంటి నిజాలు. మరిప్పుడు తనేం చేయాలి? ఏం చేస్తే ఆ గిన్నె దొరుకుతుంది? ఆమె అన్నట్లు ఆ గిన్నెకీ, తమ జీవితాలకీ అవినాభావసంబంధం చాలా వున్నది. అలాంటిది...

"బాబా! ఈ గిన్నె..." అన్నమాటలు వినబడి శంకరం వీధి గుమ్మం వైపు చూశాడు. తమదే ఆ వెండిగిన్నె! పోయిందనుకున్న వెండిగిన్నె! కళ్ళు జిగేల్‌మన్నయ్!

"లక్ష్మీ!" అంటూ పెద్దగా కేక వేశాడు. ఆ అరుపుకు ఆదిలక్ష్మి బయటకు వచ్చింది.

గుమ్మంలో పదేళ్ళ కుర్రాడు. చేతిలో వెండిగిన్నెతో, చినిగిపోయిన నిక్కరు తప్ప మరేమీలేదు వంటిమీద. అతని ప్రక్కనే అరవై ఏళ్ళ వృద్ధుడు. ఆదిలక్ష్మిని చూడగానే, "ఈ విదవ నిమిషంటేవని చేసినాడో చూడమ్మా!

చింత ఆకలికి అల్లాడితే మాత్రం, దొంగతనం చేస్తాడా? దొంగముండా... ముందు ఆ గిన్ని అరికిచ్చి, అమ్మగోరి పాదాలమీదబడు మరెప్పుడగా ఇసువంటి పని సెయమాక!" అన్నాడు మంగళింపుగా.

తూ చా. తప్పకుండా తాత చెప్పినట్లు చేశాడు కుర్రాడు. ఆదిలక్ష్మి ఆనందానికి అవధులు లేవు. చెయజారి పోయిందనుకున్న తాతలనాటి వెండిగిన్నె తిరిగి తన దగ్గరకు వచ్చింది. నిజంగా అదృష్టమంతా తనదే! "వాడిచేతిలో ఏదన్నా పెట్టండి" చేతిలో వున్న వెండిగిన్నె చీరచెంగుతో ఆప్యాయంగా తుడిచి లోపలకు తీసుకువెళ్తూ అన్నది ఆదిలక్ష్మి.

"మూడు రోజులనుంచి గంజి తాగలేదు" అన్నాడు ముసలాడు. "కాస్త అన్నం పెట్టు" అంటూ జేబులోనున్న పదిరూపాయల నోటు తీసి ఇచ్చాడు శంకరం. తను తినవలసిన అన్నం, కూర, ఆకులో పెట్టి తీసుకు వచ్చి ఇచ్చింది ఆదిలక్ష్మి. అది అందుకున్న ముసలాడు మనవడి వంకచూసి ముసిముసిగా నవ్వాడు. అదేవాడి బ్రతుకుతెరువని తెలీని ఆదిలక్ష్మి దంపతులకు, ఆత్మీయులకన్నా మిన్నగా కనిపించారు ఆ తాత మనమలు!

## బుల్లి సినీ-కామిరా!

ప్రపంచంలో అంతటిలో అంత తేలికయిన సినీ కెమెరాను, జపానులో తయారుచేసారు. టోకియోలోని ఫూజీ ఫోటో ఫిల్మ్ కంపెనీవారు దీనిని రూపొందించారు. ఫ్యూజికో సింగిల్ ఎయిమిది మోడల్ అని దీనిని పిలుస్తారు. దీనిలోనే స్నాప్ ఫోకస్‌ను అమర్చారు. ఇంత వరకు వున్న సినీ కెమెరాలతో పాటు ఫోకసును చేయడానికి వేరే యంత్రం విడిగా పని చేయవలసివచ్చేది. ఈ ఫ్యూజికా సింగిల్ ఎయిమిది కెమెరా 120×150×51 మిలి మీటర్లు వుంటుంది. మూడువందల ఏభై గ్రాములు మాత్రమే బరువు. ఇంత తేలికయిన సినీకెమెరా ప్రపంచంలో ఇదిమాత్రమే.

## ఎగిరే అంబులెన్సులు

రష్యాలో సుదూర ప్రాంత గ్రామాలలో జీవించే జాలర్లు, వేట వృత్తిలో వున్న వారికి అత్యవసర వైద్యసహాయం అందించడానికి వైద్యులను కొనిపోవడానికి సోవియట్ దూరప్రాచ్యంలో వైమానిక ఆరోగ్య సర్వీసును ప్రవేశపెట్టడం జరిగింది. ఈ విమానాలలోనూ, హెలికాప్టర్లలోనూ, ప్రయోగశాలలు; శస్త్రచికిత్సాగదులు వుండి రోగికి అత్యవసర వైద్యసహాయాన్నేగాక, దీర్ఘకాలిక చికిత్సనుగూడా చేయడానికి అనువుగా సమస్త సౌకర్యాలు వున్నాయి. ఈ ఎగిరే అంబులెన్సులను ఆర్కిటిక్, సైబీరియా, మధ్యాసియాలో విస్తారంగా ఉపయోగించడమేగాక, వీటిని దూర యాత్రాకేంద్రాలకు, వాతావరణ పరిశోధనా కేంద్రాలకు సైతం పంపడం జరుగుతూ వుంది. సోవియట్‌లో అన్ని వైద్య సర్వీసులలాగే ఈ ఎగిరే అంబులెన్సులలో సైతం వైద్యం ఉచితంగానే జరుగుతోంది.